# మల్కాజ్‌గిరి బిఆర్ఎస్ క్యాడర్‌లో అయోమయం

**ఎమ్మెల్యే మైనంపల్లి నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి**

ఎమ్మెల్యేను నమ్ముకుని ఉన్న కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు తమ భవిష్యత్తు ఏమిటనే ఆవేదనలో ఉన్నారు. మైనంపల్లి కాంగ్రెస్‌లోకి వెళ్ళడం ఖాయమనే ప్రచారానికి బలం చేకూరుస్తూ మేడ్చెల్‌లో ఆయన ప్రధాన అనుచరుడు నక్కా ప్రభాకర్ గౌడ్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం చర్చాంశనీయంగా మారింది. మంత్రి మల్లారెడ్డికి వ్యతిరేకంగా సమావేశం ఉందనే ప్రచారం జరిగింది. ఇక మైనంపల్లి తనయుడు రోహిత్ మెదక్‌లో పర్యటనలు కొనసాగిస్తున్నారు. ఇరువురి వ్యవహార శైలి చూస్తే ఎమ్మెల్యే పార్టీకి దూరం అయినట్లే అన్న వాతావరణం ఉంది. కాంగ్రెస్ పార్టీలోనూ రెండు సీట్లు ఇచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది.

**అందరి చూపు కాంగ్రెస్ సభ వైపు**

**నియోజకవర్గంలో**

**బలపడుతున్న ఎమ్మెల్యే వైరి వర్గం**

**మర్రి రాజశేఖర్ రెడ్డికి**

**రెండు ఆప్షన్‌లు ఇచ్చిన అభిష్టానం**

హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: మల్కాజిగిరి బిఆర్ఎస్ క్యాడర్‌లో అయోమయం నెలకొని ఉంది. ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పార్టీ అధిష్టానంపై చేసిన వ్యాఖ్యలుతో అంతా తారుమారైంది. పార్టీకి తిరుగు లేదు అనుకున్న తరుణంలో ప్రస్తుతం గందరగోళంగా మారింది. రానున్న ఎన్నికల్లో విజయం నల్లేరుపై నడకే అన్న చందం నుంచి నేడు అంతా అస్తవ్యస్తంగా తయారైంది. సోనియా గాంధీ సమయంలో ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరతానే ప్రచారం జరిగింది. ఈ నెల 17 ఆదివారం జరిగే సభ వైపు అందరి చూపు నెలకొని ఉంది. బిఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంటర్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డికి అధిష్టానం రెండు ఆప్షన్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది. మల్కాజిగిరి అసెంబ్లీ లేదా పార్లమెంట్ రెండింటిలో దేని నుంచైనా పోటీ చేయడానికి సిద్దంగా ఉండాలని స్పష్టం చేసినట్లు సమాచారం. మైనంపల్లి బిఆర్ఎస్‌లో ఉంటారా లేక కాంగ్రెస్‌లోకి వెళతారా అనే విషయాన్ని పక్కన పెడితే ప్రస్తుతం ఉన్న పరిస్థితులు వాడుకుని ఆయన ప్రత్యర్థులు బలపడుతున్నారనే చెప్పాలి. నియోజకవర్గంలో మైనంపల్లికి దూరంగా ఉన్న పార్టీలోని సీనియర్‌లు నేడు తెరపైకి వస్తున్నారు. అల్వాల్, మల్కాజిగిరి ప్రాంతాలులో ఇప్పటి వరకు అంటీ అంటనట్లు ఉన్న వారు నేడు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. స్థానికత్వం, స్థానికేతరులు అనే సెంటిమెంట్‌ను వాడుతున్నారు. గత జిహెచ్ఎంసి కార్పొరేషన్ ఎన్నికలులో సిట్టింగ్‌లను కాదని తన సహచరులకు ఎమ్మెల్యే అవకాశం కల్పించారు. సమయం కోసం వేచి ఉన్న ఇటువంటి వారంతా నేడు బాహాటంగా బయటకి వచ్చి ఎమ్మెల్యే టిక్కెట్ స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. మైనంపల్లి విషయంలో బిఆర్ఎస్ అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకోక పోవడం కూడా క్యాడర్‌లో నిరూత్సాహానికి కారణంగా మారుతోంది. మల్కాజిగిరి టిక్కెట్ మైనంపల్లికి కేటాయించినా మార్పులు చేర్పులు ఉంటాయని సీఎం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. తదనంతరం చోటు చేసుకున్న పరిణామాలు నేపథ్యంలో ఎమ్మెల్యేపై కెసిఆర్ సీరియస్‌గా ఉన్నారని ఆ పార్టీలోని వారే చెబుతున్నారు. తిరుపతిలో చేసిన వ్యాఖ్యలు అనంతరం మైనంపల్లి ఎంతో కొంత చల్లబడ్డారు. వారంలో నిర్ణయం ప్రకటిస్తానని అన్న ఆయన కొద్ది రోజులకు సమయం కావాలని పేర్కొనడం జరిగింది. అధిష్టానం, మైనంపల్లి మధ్య దోబూచులాటలు కొనసాగుతుండగా క్యాడర్ మాత్రం ఏమి జరుగుతుందనే ఆయోమయంలో ఉన్నారు. ప్రజలు, కార్యకర్తలుతో సంప్రదించిన తరువాత భవిష్యత్తు కార్యచరణ ఉంటుందన్న ఎమ్మెల్యే వారితో ఇప్పటి వరకు పెద్దగా చర్చించిన దాఖలాలు కనపడడం లేదు. మల్కాజిగిరి నియోజకవర్గంలో పార్టీ తరుపున ప్రధాన అభ్యర్థిగా నందికంటి శ్రీధర్ ఉన్నారు. ఆయనను కాదని మైనంపల్లి టిక్కెట్ దక్కించుకుంటారా అనేది కూడా ఒక ప్రశ్నగా ఉంది. ఎమ్మెల్యే అన్ని విధాలుగా చక్ర బందంలో ఉన్నారనే చెప్పాలి. నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు నేరుగా అధికారులే కళ్యాణ లక్ష్మీ ఇతర చెక్కులను అందిస్తుండడం విశేషం. ఎన్నికల ముంగిట ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలు సంక్షేమ పథకాలను స్వయంగా లబ్ధిదారులకు అందిస్తుంటే మల్కాజిగిరిలో ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రాజకీయంగా మైనంపల్లిని ఒంటరి చేసేందుకు ప్రతిపక్షాలు తమకు ఉన్న అన్ని అస్త్రాలను సిద్దం చేసుకుని ఉన్నాయి. సొంత పార్టీలోనే వ్యతిరేకులు సంఖ్య క్రమంగా పెరుగుతోంది. తెర వెనుక ఉన్న వారంతా లైమ్ లైట్‌లోకి వచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారితే క్యాడర్ మొత్తం అయన వెనుక నడిచే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. కార్పొరేటర్లు కొందరు బిఆర్ఎస్‌లో ఉండడానికే మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్‌లోకి వెళితే రాజకీయంగా ఆశాజనంగా ఉండదనేది వారి భయంగా ఉంది. బిజెపి ద్వారాలు బంద్ అయ్యి ఉన్నాయి. అన్ని పరిస్థితులు కలిసి వచ్చి ఎమ్మెల్యే బిఆర్ఎస్‌లోనే కొనసాగాలనే అభిప్రాయం క్యాడర్‌లో బలంగా ఉండడం విశేషం. వ్యతిరేక శక్తులు, పరిస్థితులను దాటుకుని మైనంపల్లి బిఆర్ఎస్‌లో మరలా హవా కొనసాగిస్తారా అనేది వేచి చూడాలి.

**అందరి చూపు కాంగ్రెస్ సభ వైపు..** నేడు జరిగే కాంగ్రెస్ బహిరంగ సభ వైపే అందరి చూపు ఉంది. ఎమ్మెల్యే మైనంపల్లితో పాటుగా కొందరు కార్పొరేటర్లు ఖమ్మం జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు సోనియా గాంధీ సమక్షంలో పార్టీలో చేరతారనే ప్రచారం జరిగింది. ఏఐసిసికి చెందిన ఓ నేత సైతం వీరి చేరికను ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని పార్టీలు ఖమ్మం సభపై ఆసక్తిగా ఉన్నారు. మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరతారా లేదా అనేది నేడు తేలనున్నది. కాంగ్రెస్‌లో చేరికపై ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఒక్క మాట మాట్లాడలేదు. మెదక్ టిక్కెట్ ఆశించిన ఆయన తనయుడు రోహిత్ సైతం ఎక్కడా చేరికపై నోరు మెదప లేదు. మైనంపల్లి ముఖ్య అనుచరుడు నక్క ప్రభాకర్ గౌడ్ ఆత్మీయ సమ్మేళనం కాంగ్రెస్ వైపు అన్న సంకేతాలు ఇచ్చాయి. కాంగ్రెస్ సభ అయినా బిఆర్ఎస్ క్యాడర్‌లో దీనిపై ఆసక్తిని కలిగిస్తోంది. తమ నాయకుడిపై వస్తున్న ప్రచారంలోని వాస్తవాలు సభ ద్వారా తేలి పోతుందని వారు పేర్కొంటున్నారు.

**మర్రి రాజశేఖర్ రెడ్డికి రెండు ఆప్షన్‌లు ఇచ్చిన అభిష్టానం**

బిఆర్ఎస్ అధిష్టానం మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డికి మల్కాజిగిరి నుంచి పోటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మైనంపల్లి కాంగ్రెస్‌లోకి వెళితే ఆయనను ఢీకొట్టే సత్తా మర్రికి ఉంటుందనే ఆలోచనలో అధిష్టానం ఉంది. సామాజికంగా, అర్థికంగా ఎమ్మెల్యేను తట్టుకోగలిగే వ్యక్తి ప్రస్తుత పరిస్థితిలో పార్టీకి అవసరం. మంత్రి మల్లారెడ్డి ఆయనకు ప్లస్ పాయింట్‌గా చెప్పుకోవచ్చు. గత పార్లమెంట్ ఎన్నికలులో పోటీ చేసిన అనుభవం ఉంది. నియోజకవర్గంలో క్యాడర్ బలంగా ఉండడం కలిసి వచ్చే అంశం. మర్రి రాజశేఖర్ రెడ్డికి అధిష్టానం రెండు ఆప్షన్‌లు ఇచ్చినట్లు విశ్వసనీయమైన సమాచారం. మల్కాజిగిరి అసెంబ్లీ లేదా పార్లమెంట్‌లు రెండింటిలో దేని నుంచైనా పోటీకి సిద్ద పడాలని ఆదేశించనట్లు తెలిసింది. కళాశాలలు, పాఠశాలలు నిర్వహణ ద్వారా మల్కాజిగిరి, అల్వాల్‌లో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. బందు వర్గం, స్నేహితులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అరుంధతి ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. టిఆర్ఎస్ క్యాడర్ ఆయనకు మరో ప్లస్ పాయింట్ అనే చెప్పాలి.

## వంట వార్పుతో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసన

ఒయూలో కంట్రాక్ట్ అధ్యాపకులకు సంఘీభావం తెలుపుతున్న ప్రొ.మల్లేశం ఇతర ప్రొఫెసర్లు

తార్నాక, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు శనివారం ఒ.యూలో వంట వార్పుతో నిరసన వ్యక్తం చేసి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. ప్రొఫెసర్లు ఎండలోనే వండుకొని భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా ఔటా ఉపాధ్యక్షులు ప్రొ.మల్లేశం, ప్రొ.చల్లమల్ల వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ న్యాయబద్ధమైన వీరి డిమాండ్‌ను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. వీరి నిరసనలతో ఇప్పటికే విద్యార్థులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్లు ధర్మతేజ, వేల్పుల కుమార్, ఉపేందర్, డా. తాళ్లపల్లి వెంకటేశం మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పెట్టిని అక్రమ కేసులను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా కొనసాగుతున్న దీక్షకు విసి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రవంతి రెడ్డి, మాధవి, నవీన్‌రెడ్డి, రేష్మారెడ్డి, రామేశ్వర్‌రావు, జి.వెంకటేశ్వర్లు, మచ్చరమేష్, సుదర్శన్, ముత్యాల కిరన్, శేఖర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఓర్సు కృష్ణయ్య మల్లేశంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

మ్యాన్‌హోల్స్ వద్ద గుర్తుగా కర్ర ఏర్పాటు చేసిన దృశ్యం

కొంపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అశ్విన్‌కాలనీకి వెళ్ళే రహదారిలో మ్యాన్‌హోల్స్ నోర్లు తెరుచుకొని ప్రమాదకరంగా మారాయి. చిన్న పాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లుతుంటాయి. దీంతో అటువైపుగా రాకపోకలు కొనసాగించే వాహనదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన ఫలితం లేదు. దీంతో కాలనీవాసులు ప్రమాదాల నుండి తప్పించుకునేందుకు నోర్లు తెరిచిన మ్యాన్‌హోల్స్ వద్ద గుర్తుగా కర్రలను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఆటో ఢీకొని నాలుగేండ్ల బాలుడు మృతి

మైలార్‌దేవ్‌పల్లి,సెప్టెంబరు 16 ప్రభాతవార్త : ఆటో ఢీకొట్టిన సంఘటనలో నాలుగు సంవత్సరాల వయస్సుగల బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ పి.మధు కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం మధుబన్ కాలనీ ఎంపిహెచ్ స్కూల్ వద్ద అతి వేగంగా వచ్చిన ఆటో మధ్యప్రదేశ్ రాష్ట్రం రావి జిల్లా మతారీ గ్రామానికి చెందిన వినీత్ కుమారుడైన వికాస్ (4)ను ఢీకొట్టింది.ఈ సంఘటనలో బాలుగు వికాస్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ముగ్ధమనోహరం చిన్మయి కూచిపూడి రంగప్రవేశం

రవీంద్రభారతి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : జై ఆనంద కూచిపూడి డ్యాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువు నాట్యకౌముది అనిత పాల్లేవర్ శిష్యురాలు చిన్మయి గురజాల కూచిపూడి రంగప్రవేశం తొలిఅడుగులోనే అద్భుత నృత్యవిన్యాసాలతో ముగ్ధమనోహరంగా ఆహుతులకు కనువిందు కావించింది. ఐఐటి ఖరగ్‌పూర్‌లో ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న చిన్మయి భారతీయ శాస్త్రీయకళ కూచిపూడి నృత్యంపై మక్కువతో గురువు అనిత వద్ద సంపూర్ణంగా అభ్యసించి నేడు తన కూచిపూడి రంగప్రవేశాన్ని సంప్రదాయ ప్రార్థనానంతరం రాగమాలిక రాగంలో ఆదిశంకరాచార్య విరచిత గణేష పంచరత్నంతో ప్రారంభించి రాజేశ్వరి అష్టకం; నారాయణతీర్థ కృష్ణం కలియసకి సుందరం; భామాకలాపం; శ్రీనివాస అయ్యంగార్ నిరుపమాన సామిని; తిల్లానా చివరిగా మంగళం అంశాలతో కృతి లయబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శిస్తూ ప్రతిభను చాటుకొని ప్రేక్షకుల శుభాశీస్సు లందుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సి.పార్థసారథి, శ్వేత పాల్గొని కళాకారిణి చిన్మయిని ఎంతగానో అభినందించారు.

## గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు గట్టి బందోబస్తు

**చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్**

చార్మినార్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా చార్మినార్ డివిజన్ పరిధిలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామని చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ అన్నారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శనివారం పాల్కేగార్డెన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండపాలనిర్వాహకులు మండపాల వద్ద జాగ్రత్తగా ఉండాలని,అన్ని మండపాలు వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. హుస్సేనీఆలం సిఐ నాగేశ్వరరెడ్డి, చార్మినార్ సిఐ చంద్రశేఖర్,కామాటిపుర సిఐ కమలాకర్‌తో పాటు పలువురు గణేష్ మండపాల నిర్వాహకులు సమావేశంలో పాల్గొన్నారు.

## ఇంజనీర్స్ డే సందర్భంగా మెట్రో ఎండికి సత్కారం

హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ రంగాలలో గుర్తింపు, ప్రపంచంలో అతిపెద్ద మెట్రో రైలు ప్రాజెక్టును నిర్మించడంలో కీలకపాత్ర పోషించిన హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఏఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్.రెడ్డిని సత్కరించే కార్యక్రమం శనివారం లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఆర్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) మోడ్‌లో చాలా ఇంజనీరింగ్, ఫైనాన్షియల్ ఆవిష్కరణలో కీలకపాత్ర పోషించడాన్ని స్వాగతిస్తూ లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎన్‌విఎస్.రెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్లు అందరూ ఉన్నతమైన లక్ష్యంతో వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మెట్రోరైల్ నిర్మాణంలో ఎదుర్కొన్న సవాళ్ళను, లక్ష్యాలను ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌కుమార్, ప్రఖ్యాత శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.బాలమురళీ కృష్ణన్, డాక్టర్ జెఆర్.జోషి, ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా పూర్వ సలహాదారు ఎస్‌కె.వర్మ తదితరులు పాల్గొని సత్కరించారు.

హైదరాబాద్ వార్త

## ఖైరతాబాద్ గణేశుడు రెడీ

**నేటినుంచి భక్తులకు దర్శనం**

**రేపు తొలిపూజ చేయనున్న గవర్నర్ తమిళసై**

హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: వినాయక చవితి వచ్చిందంటే ఖైరతాబాద్ బడా గణేశుడు ప్రత్యేక ఆకర్షణ, తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, మహారాష్ట్రవంటి రాష్ట్రాలనుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఈనేపథ్యంలో భక్తుల పూజలను అందుకు నేందుకు ఖైరతాబాద్ మహాగణపతి సిద్ధమయ్యాడు. ఈనేపథ్యంలో గణేషుడి తీర్చిదిద్దే పనుల్లో చివరి అంకం శనివారం ముగిసింది. శిల్పి రాజేంద్రన్ చివరగా గణనాథుడి కళ్లు దిద్దగా అనంతరం కర్రల తొలగింపు ప్రక్రియ మొదలుపెట్టగా రాత్రివరకు ముగిసింది. దీంతో ఆదివారం ఉదయం నుంచి భక్తులు చూసే అవకాశం ఉత్సవకమిటీ కల్పించనున్నారు. కాగా వినాయకచవితి సందర్భంగా సోమవారం ఉదయం 10గంటలకు గవర్నర్ తమిళసై తొలిపూజ చేయనున్నారు. ఈసారి ఖైరతాబాద్ గణణాధడిని శ్రీదశ మహా విద్యా గణపతిగా 63అడుగుల ఎత్తులో రూపొందించారు. 2019లో 61అడుగుల మేర రూపొందించగా..ఈసారి అంతకుమించి రెండు అడుగుల ఎత్తులో తీర్చిదిద్దారు. 1954 నుంచి ఖైరతాబాద్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న ఖైరతాబాద్ గణేష్ అసోసియేషన్ ప్రతిఏటా విగ్రహ ఎత్తును పెంచుకుంటూ వస్తోంది. అలాగే బడా గణపతిని తీర్చిదిద్దే విధానంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాలుపంచుకున్నారు. ఇందులో భాగంగా విగ్రహ డిజైన్ హైదరాబాద్‌కు చెందిన సి.రాజేందర్, నమూనా ప్రింట్ పనులు నల్లనాగుల శరత్ 30ఏళ్లుగా చేస్తున్నారు. వెల్డింగ్ వర్క్, మచిలీపట్నానికి చెందిన నాగబాబు బృందం, మట్టిపనులను ఒడిశాకు చెందిన మట్టి కళారారుడు జోగారావు బృందం చూస్తుంది. చెన్నైకి చెందిన కళాకారుడు మూర్తి విగ్రహ రూపాన్ని డిజైన్ చేశారు.

## డీఎస్సీ పరీక్షలకు గడువు ఇవ్వాలి

**తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకుల డిమాండ్**

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నేతలు

ధర్నాచౌక్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త: నోటిఫికేషన్ జారీ చేసి, కేవలం రెండు నెలలో పరీక్షలు నిర్వహిస్తామంటే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, కాబట్టి డీఎస్సీ పరీక్షలు నవంబర్‌లో కాకుండా మరో రెండు నెలల గడువు ఇవ్వాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్ 3, గ్రూప్ 2 పరీక్షలు కూడా నవంబర్ నెలలో జరుగుతున్న నేపథ్యంలో హడావిడిగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, రెండు నెలలు మాత్రమే పరీక్షలకు సమయం కేటాయిస్తే సిలబస్ పూర్తి చేయలేక, విద్యార్థులు పరీక్షలు రాసినా ఫలితం శూన్యంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఎర్ర సత్యనారాయణ, రాంమోహన్, మహిపాల్ యా దవ్, సుధాకర్, రాజ్‌కుమార్, రాజేందర్, ఉదయ్, సతీష్, శివ, రాందేవ్ పాల్గొన్నారు.

## అధికారిణిని వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

కంటోన్మెంట్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న ఓ ఐఏఎస్ అధికారిణికి వేధింపులు ఎదురైనాఘటన మర్చిపోకముందే మరో మహిళా ఐఏఎస్ అధికారికి వేధింపులకు గురికావడంతో ఆ వ్యక్తిపై మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధిచిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయం సమీపంలో ఉన్న అయుషు శాఖలో సంచాలకులుగా పనిచేస్తున్న ఓ ఐఏఎస్ అధికారిణి కార్యాలయానికి శివప్రసాద్ అనే వ్యక్తి తన డ్యూటీ విషయంలో సహాయం చేయాలని తరుచుగా కార్యాలయానికి వస్తున్నాడు. దీంతో విసిగిపోయిన ఐఏఎస్ మహిళా అధికారి కార్యాలయంలోకి శివప్రసాద్‌ను అనుమతించవద్దని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో శివప్రసాద్‌ను ఆఫీస్‌లోకి అనుమతించక పోవడంతో ఐఏఎస్ అధికారిణి ఇంటి చిరునామా తెలుసుకొని ఈ నెల 13న ఆమె ఇంటికి వెళ్లి కాలింగ్ బెల్ నొక్కాడు. దాంతో బయటికి వచ్చిన ఆమె సిబ్బంది ప్రశ్నించడంతో మెడమ్‌ను కలువాలని, స్వీట్ బాక్స్ ఇచ్చి పోతానని కోరాడు. దీంతో అందుకు తిరస్కరించిన సిబ్బంది అక్కడి నుంచి పంపివేశారు. శివప్రసాద్ అనే వ్యక్తి ఐఏఎస్ మహిళా అధికారికి తరుచుగా వేధింపులు ఎదురు కావడంతో అతనిపై మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివప్రసాద్‌పై ఐపిసి 354 డి సెక్షన్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పాతబస్తీలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

చార్మినార్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలోని హుస్సేనీఆలం,మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు.దాదాపు నలభై ఐదు రోజులు పాటు హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి నాగేశ్వరరెడ్డి, మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆనంద్ సిసిఎస్‌కు బదిలీ అయ్యారు.కాగా వారి స్థానంలో సిసిఎస్‌కు చెందిన ఎస్.సురేందర్ హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్‌గా,ఆర్.రఘునాథ్ మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు.

## మట్టి వినాయకులు తయారు చేసి పంపిణి చేసిన నిజాం కళాశాల విద్యార్థులు

సైఫాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: వినాయకచవిత పండువను పురస్కరించుకుని నిజాం కళాశాల విద్యార్థులు మట్టి వినాయకుడి విగ్రహాలను తయారుచేసి శనివారం కళాశాల ప్రాంగణంలో పంపిణి చేశారు. పర్యావరణ పరిక్షణ కోసం విద్యార్థులు చేస్తున్న కృషికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.బీమా, వైస్-ప్రిన్సిపల్ డా.జి.ఉపేందర్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డా.ఎస్.రేణుక, పిఆర్ఓ సి.హెచ్.పరాందములుఅభినందించారు. విద్యార్థులను వారు అభినందించి, సర్టిఫికేట్లను అందజేశారు. డిగ్రీ కోర్సులు చదువుతున్న 58 మంది విద్యార్థిని, విద్యార్థులు గణపతి ప్రతిమలను తయారుచేశారని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఈషా, ప్రవళికలు తెలిపారు.మట్టి వినాయకుల తయారిలో ప్రథమ బహుమతి తేజశ్రీధర్‌కు, ద్వీతీయ బహుమతి ఇందుమతి, నిహారికలకు, తృతీయ బహుమతి విష్ణు, ముకేష్‌లకు ప్రిన్సిపల్ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో గిరి, ప్రియాంక, సుజిత్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి

**పంజగుట్ట ఏసీపి మోహన్‌కుమార్**

మధురానగర్ సాయి రామకృష్ణమరాజు కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఏసిపి మోహన్ కుమార్

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : గణేష్ మంటపాలను ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పంజగుట్ట ఏసీపి మోహన్‌కుమార్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో శనివారం సాయంత్రం మంటపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపి మోహన్‌కుమార్ మాట్లాడుతూ మంటపాల నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు,కళ్యాణ చక్రవర్తి అసోసియేషన్ నేతలు రాజేంద్రప్రసాద్, డి.సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐలు ఉదయ్, సాయినాథ్‌రెడ్డి, మాధవీరెడ్డి పాల్గొన్నారు.

## వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఫోటో, వీడియోగ్రాఫర్ల స

## అంగన్‌వాడి కేంద్రంలో పోషన్ మహా కార్యక్రమం

ఏవిబి పురంలో పోషకాల గురించి అవగాహన కల్పిస్తున్న ఆశ వర్కర్లు

మూసాపేట, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : బాలానగర్ మండలం శ్రీశ్రీ నగర్ అంగన్‌వాడి కేంద్రంలో చిరుధాన్యాలు వాటి విశిష్టత గురించి పోషన్ మహా కార్యక్రమం పేరిట శనివారం ప్రజలకు, గర్భినీ స్త్రీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం ఆశ చిరుధాన్యాలలో ఉండే అధిక పీచు పదర్థాలు, లభ్యమగు విటమిన్ల గురించి వివరించడంతో గుడ్లు, కూరగాయల వలన శరీరానికి అందే పోషకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.వి.బి. పురం అంగన్‌వాడి టీచర్ అనిత, సూపర్వైజర్, స్థానిక గర్భినీ స్త్రీలు పాల్గొన్నారు.

## కర్నాటక ఉప ముఖ్యమంత్రికి అభినందనలు

డికె శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగులూరి సాయిబాబా

సికింద్రాబాద్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్తః కర్నాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం, కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డికె శివకుమార్‌ను కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు, ప్రముఖ సంఘ సేవకుడు నాగులూరి సాయిబాబా మర్యాదపూర్వకంగా కలిశారు. శివకుమార్ హైద్రాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపడంతో పాటు అభినందనలు తెలిపారు.

## సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ వాహన ర్యాలీ

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్..** కొల్లాపూర్‌లో శనివారం సాయంత్రం జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ వాహన ర్యాలీతో పెద్దయెత్తున తరలి వెళ్ళారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ నాయకత్వంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ నేతలతో కూడిన వాహన ర్యాలీని వెస్ట్ మారేడ్‌పల్లిలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు.

## కొల్లాపూర్ సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నేతలు

**కంటోన్మెంట్..** కొల్లాపూర్‌లో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు కంటోన్మెంట్ నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యాకర్తలు భారీగా తరలివెళ్ళారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యాక్రమంలో నేతలు టీఎన్. శ్రీనివాస్, నర్సింహ్మ ముదిరాజ్, సంతోష్, సదానంద్, ఆనంద్, భాస్కర్ ముదిరాజ్, మురళియాదవ్, నరేష్, విజయలక్ష్మీ, కిరణ్, అజయ్, మల్లేష్, చిన్న, శ్రీహరి, భవాని, శత్రు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి భవన్‌ను సందర్శించిన విద్యార్థులు

విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : నిజాంపేట జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శనార్థం డిప్యూటీమేయర్ ధన్‌రాజ్‌యాదవ్ బస్సులను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం పాఠశాల వద్ద బస్సులను ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు పరిష్కరిచేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొ న్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవికిరణ్, నాయకులు జగన్ యాదవ్, ధశరథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఛలో పాలమూరు బహిరంగ సభకు వెళ్లిన నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

## పేద విద్యార్థులకు అండగా ఉంటాం: కూన శ్రీనివాస్‌గౌడ్

విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

జీడిమెట్ల, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : గాజుల రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కెకెఎం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ శనివారం నోటుపుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు శ్రీశైలంగౌడ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యే అయ్యారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎన్నటికి మరువ వద్దన్నారు. పేద విద్యార్థులకు కెకెఎం ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిత్తారమ్మ ఆలయకమిటి చైర్మన్ అంతయ్యగౌడ్, కార్యదర్శి బాలరాజు, నాయకులు బుచ్చిరెడ్డి, సాయినాథ్‌నేత, రేవతిరెడ్డి, రాజిరెడ్డి, వర్మ, జ్ఞానీ, టైసన్, మురళి, నరేందర్‌రెడ్డి, గంగారామ్, లక్ష్మణ్, జహాంగీర్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : మెయింటనెన్స్‌లో భాగంగా గాగిల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అదివారం(17-09-2023)రోజున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంల నుండి మధ్యాహ్నం 2గంల వరకు చైతన్యకాలనీ, చర్చిగాగిల్లాపూర్, గాగిల్లాపూర్ ఎక్స్‌రోడ్స్, సర్వేనంబర్ 214కాలనీలు, గ్రీన్‌వుడ్‌విల్లాస్, గాగిల్లాపూర్ గ్రామం, డ్రీమ్‌వన్‌విల్లాస్, తాండా-1, తాండా-2, గాగిల్లాపూర్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎసిపి వెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు అధికారులు

దుండిగల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : వినాయక నవరాత్రి ఉత్సవాలను ఆయా ప్రాంతాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎసిపి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్లో శనివారం సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానికులతో ప్రత్యేక శాంతి కమిటి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఎసిపి మాట్లాడుతూ పండుగలను ఐకమత్యానికి ప్రతీకలు అన్నారు. గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గణేష్ మండపం నిర్వాహకులు బాధ్యత తీసుకొని రాత్రివేళల్లో కనీసం ఇద్దరు సభ్యులైన మండపంలో నిద్రించాలన్నారు. విద్యుత్ సరఫరాకు విద్యుత్‌శాఖ నుండి అనుమతి పొందాలన్నారు. మత విద్వేషాలకు తావివ్వ కుండా ప్రతిఒక్కరు సోదర భావంతో ఉత్సవాలను జరుపుకోవాలని పేర్కొన్నారు. డిజెలకు ఏలాంటి అనుమతి లేదని, నిర్వాహకులు ఎవరైనా డిజెలు పెడితే డిజెను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వివాదస్పద స్థలాల్లో విగ్రహా ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో డిఐ శ్రీనివాస్, ఎస్సైలు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## నాటకాలు ఆధునిక సామాజిక దీపికలై కలకాలం నిలుస్తాయి

**ఆచార్య కొలకలూరి ఇనాక్**

నాటక రచయితలు ఆనందరావు, విజయభాస్కర్‌లను సత్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, విద్యాసాగర్, బలరామయ్య

నాంపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : పడమటి గాలి, రాజుగాడు రాజయ్యాడు నాటకాలు ఆధునిక సామాజిక దీపికలై కలకాలం నిలుస్తాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార స్వీకర్త, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. లతారాజా ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో పై రెండు నాటకాలలో కొన్ని అద్భుత సన్నివేశాలను ప్రదర్శించినాంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సభాప్రారంభకులు డా. అంగలకుర్తి విద్యాసాగర్, సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు జి.బలరామయ్య, డా. జి.లక్ష్మీనరసయ్య, నిర్వాహకులు కె.కె.రాజా, పిఎస్ఎన్.మూర్తి, రాజా అంజన, రాజా సంజన తదితరులతో కలిసి సర్వమానవ సమానత్వం-తెలుగు నాటక చైతన్యం శీర్షికన సాంఘిక సమానత్వం కోసం అహర్నిశలు విశేషకృషిచేసిన ప్రముఖ నాటక రచయితలు, దర్శకులు డా. పాటిబండ్ల ఆనందరావు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా. దీర్ఘాసి విజయభాస్కర్‌లను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## 29వ తేది వరకు జ్ఞాన యజ్ఞ మహోత్సవం

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : మోతీనగర్ ప్రాంతంలోని శ్రీశృంగేరి శారదా శంకర మఠంలో శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవాన్ని ఈనెల 23వ తేది నుంచి 29వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు శారద శంకర మఠం నిర్వాహకులు తెలిపారు. జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారి దివ్యాశీస్సులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని బ్రహ్మశ్రీ తంగిరాల రాజేంద్రప్రసాద్ శర్మచే ప్రసంగం ఉంటుందని ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

## కెసిఆర్ స్వాగతం పలికిన గోషామహల్ బిఆర్ఎస్ నాయకులు

గోషామహల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త: తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలమూర్, రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వెళ్తున్న సందర్భంగా శనివారం గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు స్వాగతంపలికారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్,శైలందర్,పప్పు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక పండుగను ఘనంగా జరుపుకోవాలి: బోనాల శ్రీనివాస్‌గుప్త

అప్జల్‌గంజ్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా వినాయక ఉత్సవాలను భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్ గుప్త కోరారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సిద్దింబర్‌బజార్‌లోని బహెతీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడు తూ గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులతో కలిసి వినాయక ఉత్సవాలను భక్తి శ్రద్దలతో జరుపుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులను పోలీసులు వేధింపులకు గురి చేయవద్దన్నారు. మండపాల వద్ద భక్తి గీతాలను ఆలపించే విధంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో అభిషేక్, శక్తిసింగ్, ఆశీష్‌వ్యాస్, ఉత్సవసమితి సభ్యులు వెంకటేష్‌గౌడ్, రాజేష్‌సింగ్, రాహుల్, నవనీషిండే పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలను పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుకుందాం

**కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్**

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: వినాయక చవితి సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని జనప్రియ అబోడ్స్ ప్రాంగణంలో ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ స్వాతి ప్రమోటర్స్ అధినేత సిహెచ్.నారాయణ, జి.నాగేందర్ నేతృత్వంలో మట్టిగణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో జనప్రియ అబోడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వి.మురళీ, లక్ష్మి, ప్రతాప్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రజలందరు గణపతి పండుగను భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించడంలో భగస్వాములు కావాలని అన్నారు. మట్టి విగ్రహాలతోనే పూజించాలన్నారు.

## రాజకీయాల్లో ఆప్ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తాం

**ఆప్ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ ప్రకటన**

ఆప్ నూతన మహిళా కార్యవర్గంకు నియామక పత్రాలను అందజేసిన డా.బిడ్డి సుధాకర్

సైఫాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి ఆమ్ ఆద్మీ పార్టీలో మహిళా శక్తికి సముచిత స్థానం కల్పిస్తామని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రకటించారు. ఆప్ పార్టీని బలోపేతం చేసేందుకు ఆప్ మహిళా విభాగాన్ని మరింతగా పటిష్ట పరచడానికి ఆప్ మహిళా విభాగం నూతన రాష్ట్ర కమిటిని ఏర్పాటు చేసిందన్నారు. శనివారం ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ మహిళలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడానికి సాధికారతకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు ను త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి అమోదింపజేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆప్ మహిళా విభాగం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆప్ పాలిత రాష్ట్రాలలో ఉచిత విద్యుత్, విద్య, వైద్యంతోపాటు 'సమ్మన్ రాశీ' మహిళలకు 1000 రూపాయలు అందిస్తున్న పథకాలను ఇంటింటిక తిరిగి రా ష్ట్రంలోని ప్రజలకు వివరించాలన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా హేమ జిల్లోజ, ఉపాధ్యక్షులుగా డా.ప్రియాంక, ఆర్షియాఖాన్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్ యమునాగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా జి.దేవిక, షహనా అహ్మద్, ఫర్‌హిన్‌బేగం, కార్యవర్గ సభ్యులుగా గాజుల మౌనికా, శ్వేతా, మాధవి, అధికార ప్రతినిధిగా ఆఫనా సలాంను నియమించామని సుధాకర్ తెలిపారు.

అధ్యాపకులు, విద్యార్థులకు మట్టి వినాయకులు పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

## మట్టి వినాయకులను పూజించి ప్రకృతి సమతుల్యతను కాపాడుదాం

హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: వినాయకచవితి సందర్భంగా మనమందరం మట్టి వినాయకుడిని పూజించి ప్రకృతి సమతుల్యతను కాపాడుకుందామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం గోల్నాకలోని భారతీయ విద్యా భవన్ స్కూల్ విద్యార్థులకు మట్టి వినాయకులు పంపిణి చేసిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కొద్దిసేపు సరదాగా ముచ్చటించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసే గణపతి విగ్రహాల కంటే మట్టి విగ్రహాలు మేలైనవని, వీటిల్లో రంగులు, రసాయనాలు కలవవని భూమిలో తెలికగా కలిసిపోతాయని, తద్వారా భూమి ఉత్పాదక శక్తిని మెరగవుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తోపాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలు పేద కులాలకే నాయకత్వం అప్పగించాలి

సైఫాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: రాష్ట్రంలో 7 శాతం లేని అగ్రకులాలు 7 రాజకీయ పార్టీలకు నాయకత్వం వహించడం ఏమిటి ?, నాయకత్వ స్థానం నుంచి దోరలు తొలగిపోయి 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసిలకు నాయకత్వం అప్పగించాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధం ధర్నా చేపట్టింది. పార్టీ హైదరాబాద్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో శనివారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ రహెమాన్ మాట్లాడుతూ మీ పార్టీలలో అధిక నాయకత్వాన్ని బిసిలకు కేటాయించాలని, నిర్మాణంలో 90 శాతం అణగారిన కులాలకు నాయకత్వం ఇవ్వాలని, దళితుడి సిఎం స్థానాన్ని కేటాయించాలని, క్యాబినేట్‌లో బిసి, ఎస్సీ, ఎస్టీలకు 93 శాతం అవకాశం కల్పించాలని, ఉన్నతాధికారుల పదవులన్ని తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఎసిపి శంకర్‌రాజు

ట్రాఫిక్ ఉల్లంఘన దారులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

బేగంపేట సెప్టెంబరు 16,ప్రభాతవార్త : వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు.వినాయక చవితి సందర్భంగా ఈ ఏడాది ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని ఏసీపీ పిలుపునిచ్చారు.నీటి కాలుష్యం ఏర్పడకుండా ఉండటనికి ట్రాఫిక్ ఉల్లంఘన దారులు,ప్రయాణికులు,ఏకో ఫ్రెండ్లీ గణేష్ విగ్రహాలను పూజించాలన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్,మైనర్ డ్రైవింగ్,హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం ,సరైన నెంబరు ప్లేట్ లేకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఇతర ఉల్లంఘ నలు చేయవద్దని ఏసీపీ వారికి సూచించారు.

## మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన మేయర్ గద్వాల విజయలక్ష్మీ

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : వినాయక చవితి పండుగ సందర్భంగా బంజారా హిల్స్ జలగం వెంగల్‌రావు పార్క్‌లో కమీషనర్ రోనాల్డ్ రోస్‌తో కలిసి శనివారం మట్టి గణేష్ విగ్రహాలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో శని, ఆదివారాలలో రెండు రోజుల పాటు మట్టి గణేష్ ప్రతిమలని ఉచితంగా పంపణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం జలగం వెంగళరావు పార్క్‌లో చేపడుతున్న పనులను మేయర్, కమీషనర్ రోనాల్డ్ రోస్ కలిసి పరిశీలించారు.

## ఉపాధ్యాయుల బోధించే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా ఆలకించాలి

బేగంపేట సెప్టెంబరు 16,ప్రభాతవార్త : ఉపాధ్యాయులు బోధించే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా ఆలకించాలని కంటోన్మెంట్ బీజేపీ నాయకురాలు సుస్మిత అన్నారు.మడ్ ఫోర్డ్ ప్రాథమికోన్నత పాఠశాలలో సెల్ఫ్ గవర్నెన్స్ కార్యక్రమంలో భాగంగ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బీజేపీ నాయకురాలు సుస్మిత ముఖ్య అతిధిగా హాజరయ్యారు.విద్యార్థులు చిన్న నాటి నుంచే ఒక లక్ష్యం నిర్ణయించుకొని దానికి అనుగుణంగా విద్యాబోధన చేసినట్లైతే వారు అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకునే వీలుంటుందన్నారు.ఉపాధ్యాయుల బదీలీ,పదోన్నతుల విషయంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలు పెట్టిందని,దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అనంతరం ఉన్నత పాఠశాల ఇంచార్జి దేవేందర్‌రెడ్డి,ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం ఆశీర్వాదం ఉపాధ్యాయులు శ్రీలతా,షెఫ్రక్,నజీముద్దీన్,ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుస్మితను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

## ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పోరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాలను శనివారం స్థానిక కార్పోరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి దేవాలయానికి వచ్చిన భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో వినాయక పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, హనుమాన్ దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, సీనియర్ నాయకులు సరాఫ్ సంతోష్, ఝాన్సీ, పుష్పలత, రుక్మిణీరెడ్డి, పద్మ, సుధాకర్‌రెడ్డి, అనంతరెడ్డి, రాజేష్, సీనియర్ సిటీజన్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పిఎస్ మహాధర్నా

సైఫాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరానికి వస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి అమోదించాలని , ఇందుకు అనుకూలంగా సిడబ్ల్యూసి సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు శనివారం బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు వర్గీకరణ బిల్లును ప్రవేశపెడుతుందో స్పష్టంగా ప్రకటన చేయాలని, మాదిగ ప్రజల ఆకాంక్షయిన వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి అమోదించాలని కోరారు. గతంలో ప్రధాని నరేంద్రమోదీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. ఇదిలా ఉండగా ధర్నా చేస్తున్న కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులు

జీడిమెట్ల, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : సుభాష్‌నగర్ డివిజన్ పరిధి అపురూపకాలనీలోని టివిఆర్ మోడల్ హైస్కూల్లో శనివారం వినాయక మట్టి ప్రతిమల తయారీ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆదిదేవుడు మహాగణపతి ప్రతిరూపాలను తయారు చేసి ఆకట్టుకున్నారు. విగ్రహాలకు పప్పు దినసులు, పొట్ల గింజలు ఆభరణాలుగా అందంగా అలంకరించారు. ఈసందర్భంగా చైర్మన్ కొటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పండుగలపై అవగాహన కల్పించడంతో పాటు సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ రవిచంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయభేరిని విజయవంతం చేయండి

కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

యాకుత్‌పుర, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్య

## 30నుంచి కేరళ, తెలంగాణ హెరిటేజ్ ఫెస్టివల్

కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ, బెంజ్‌మన్

హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: కేరళా -తెలంగాణ హెరిటేజ్ ఫెస్టివల్‌లను ఈనెల 30నుంచి అక్టోబర్ 2వరకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు తెలంగాణ సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మలయాళీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజులపాటు జరిగే ఈకార్యమానికి మొదటిరోజు మంత్రులు కెటిఆర్,శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కేరళా మంత్రులు సజ్జీచెరియన్, అహ్మద్ దేవరకోవలిలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఈవేడుకల్లో తెలంగాణ ,కేరళా రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ నృత్యాలు, కళలు ప్రదర్శించబడుతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మలయాళీ అసోసియేషన్ అధ్యక్షులు లిబ్బి బెంజ్‌మన్,ప్రోగ్రాం చైర్మన్ జనార్ధన్, ప్రదీప్, ప్రమోద్,దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించే పార్టీకే మా మద్దతు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం

ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న దరిపల్లి చంద్రం, మహేందర్, నల్లస్వామి, రవి

హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త: సమస్యలు పరిష్కరించే పార్టీలకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని భవన నిర్మాణ కార్మిక సంఘం (బిఎన్ఆర్‌కె) ప్రకటించింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తమ సమస్యలు పరిష్కరించాలని కెసిఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వానికి మెరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రేస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకు వచ్చిన పథకాలే అమలవుతున్నాయన్నారు. అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నట్లు చెబుతున్న ముఖ్యమంత్రి భవన నిర్మాణ కార్మికుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని అన్నారు. జిల్లా మండల గ్రామీణ స్థాయిలో సమావేశాలు నిర్వహించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేసే పార్టీలు మద్దతు కూడగడతామని చెప్పారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మహేందర్, నల్లస్వామి, రవి రమేష్, శంకర్, అఖిల్ ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### సిఎం కెసిఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సిఎం కెసిఆర్ ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొనేందుకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ శనివారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట లక్ష్మీగణపతి దేవాలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, మాజీ చైర్మన్ శంకర్ మూదిరాజ్, సోమసుందర్, భాస్కర్, బల్వంత్‌రాజ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి డైమండ్ పాయింట్ సీపంలో ఆర్ట్ గ్యాలరీ చిత్రలేఖన ప్రదర్శన : ముప్పిడి విఠల్

కంటోన్మెంట్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: కంటోన్మెంట్ డైమాండ్ పాయింట్ ట్రాన్స్‌పోర్ట్ రోడ్డులో మాలిని ఆర్ట్ గ్యాలరీ చిత్రలేఖ ప్రదర్శన నేటి నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు చిత్రలేఖ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చిత్రకారుడు ముప్పిడి విఠల్ తెలిపారు. సోమవారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకర లసమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్ర లేఖ ప్రదర్శనకు ఎంతో ప్రముఖ్యత ఉందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 12 మంది చిత్రకారుల చేత వివిధ రూపాలు, పలు రకాల చిత్రలేఖలను ప్రదర్శనలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తాను ప్రదర్శించిన చిత్రలేఖలతో ప్రధాని నరేంద్ర మోడి ముఖ్య మంత్రి కేసిఆర్‌లు తనను అభినందించారన్నారు. వివిధ రకాల చిరు దాన్యాలతో రూపొందించి సిఎం కేసిఆర్‌కు తాను ప్రదర్శించిన చిత్రలేఖనం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అర్ట్ గ్యాలరీ నిర్వాహకులు హద్దు రామా దేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా

కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ

కౌన్సిలర్ క్రిష్ణకు సమస్యలు వివరిస్తున్న సంక్షేమసంఘాల ప్రతినిధులు

దుండిగల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమసంఘాల ప్రతినిధులు శనివారం బిఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితంగా పరిష్కరిచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటి పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంక్షేమసంఘా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### ఉప్పల్‌లో ఆందోళనకు దిగిన టిడిపి నేతల అరెస్ట్

ఉప్పల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ఉప్పల్‌లో నిరసన దీక్ష చేపట్టేందుకు సిద్ధమైన పలువురు పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. టిడిపి మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి పాలిట్‌బ్యూరో మెంబర్ బక్కని నరసింహులు, అధికార ప్రతినిది నన్నూరి నర్సి రెడ్డి, టిజికె మూర్తి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలం అశోక్,కె.గిరిబాబు, రాష్ట్ర నాయకులు కల్లూరి వేణు, రామచంద్రగౌడ్, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, గడ్డమీది రాములు, డివిజన్ అధ్యక్షుడు తిక్క ప్రకాష్, డాన్ బిక్షపతి, పబ్బతి శేఖర్‌రెడ్డి, డా.అశోక్, రాజేష్, మాచర్ల ప్రతిభ, సావిత్ర తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎపిలో నియంత పాలన సాగుతోందని, టిడిపి అధినేత అరెస్ట్‌కు నిరసనగా ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

### పాలమూరు సభకు తరలివెళ్లిన ఉప్పల్ బిఆర్ఎస్ నేతలు

ఉప్పల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : నాగర్‌కర్నూల్‌లో జరిగిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ఉప్పల్ నుంచి పలువురు బిఆర్ఎస్ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఉప్పల్ బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ర్యాలీగా తరలివెళ్లారు.

## పోలీసుల దాడిలో గాయపడ్డ వీరపనేనికి పరామర్శ

డాక్టర్ పద్మ వీరపనేనిని పరామర్శించిన గౌతమ్‌రావు

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : కేంద్రమంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని ఇందిరా పార్క్ వద్ద అరెస్ట్ చేసిన క్రమంలో తీవ్ర గాయాలైన జాతీయ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ భాజపా నాయకురాలు డాక్టర్ పద్మ వీరపనేనిని శనివారం బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా.ఎన్.గౌతమ్ రావు ఆత్మీయ పూర్వకంగా కలిసి పరామర్శించారు. శ్రీనగర్ కాలనీలోని భాజపా పార్టీ కార్యాలయంలో గౌతమ్‌రావు డాక్టర్ పద్మను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరా పార్క్ వద్ద జరిగిన జి.కిషన్‌రెడ్డి ఉపవాస దీక్షలో పాల్గొన్న డాక్టర్ పద్మ వీరపనేనిని పోలీసులు దురుసు ప్రవర్తనకు గురై తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ డాక్టర్ పద్మ వీరపనేని త్వరితగతిన కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. తనను పరామర్శించడానికి వచ్చిన గౌతమ్ రావుకు డాక్టర్ పద్మ వీరపనేని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వైద్యుల పర్యవేక్షణ అనంతరం కోలుకుంటున్న డాక్టర్ పద్మను పరామర్శించిన వారిలో గౌతమ్‌రావుతో పాటు ఆజాద్‌బాబు, అసెంబ్లీ కన్వీనర్ కుంభల గంగరాజు, డివిజన్ అధ్యక్షులు హరీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో రోడెక్కిన బాబు అభిమానులు

తార్నాక ప్రధాన రోడ్డుపై చంద్రబాబునాయుడుకు మద్దతుగా మౌనదీక్ష చేస్తున్న బాబు అభిమానులు

తార్నాక, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : ఏపీ.సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ శనివారం తార్నాకలో తార్నాక కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో మౌనదీక్ష చేపట్టారు. వీరికి మద్దతుగా టీడీపీ సికింద్రాబాద్ నియోజక వర్గం ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్‌తో, కాప్రా మాజీ కార్పోరేటర్ కొత్తరామారావుతో పాటు వందలాది మంది బాబు అభిమానులు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం తార్నాకలో భారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ కుమార్, కొత్తరామారావు, తార్నాక కమ్మవారి సేవా సంఘం ఉపాధ్యక్షురాలు నాగమల్లేశ్వరీ, వల్లభనేని వీరభద్రరావు మాట్లాడుతూ సైకో పోవాలి బాబురావాలని కోరారు. బాబు అరెస్టును ప్రతి ఒక్కరు ఖండించి మద్దతు నిలువాలని కోరారు. చంద్రబాబును అక్రమంగా ఇరికించినప్పటికి ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కిల్లారి శ్రీనివాస్, సుంయుక్త కార్యదర్శి సీతారామయ్య, సభ్యులు అడువిల్లి వీరయ్య చౌదరి, నర్సింహ్మారావు, రాధాకృష్ణ, సుబ్బారావు, రమేష్ బాబుతో పాటు పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిదంగా టీడీపీ నాయకులు గండికోట విజయ్‌కుమార్ తధితరులు పాల్గొన్నారు.

## బస్తీ వాసులకు బస్సు సౌకర్యం పరిష్కారం

శివబస్తీ ఎమ్ఎమ్‌టియస్ స్టేషన్ వద్ద బస్సు సౌకర్యం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : ఎన్నో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న సబ్దార్‌నగర్ రాజీవ్‌గాంధీ నగర్ బస్తీ వాసులకు బస్సు సౌకర్యం సమస్య త్వరలో పరిష్కారం కానున్నది. ఇటీవల ఈ ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించిన స్థానిక శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్‌లు ఈప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని జనాభా పెరగడంతో వారికి బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు వారిని కోరగా వెంటనే స్పందించి టిఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అందుకు శనివారం కూకట్ పల్లి డిపో మానేజర్ కార్పోరేటర్‌తో కలిసి వచ్చి బస్సు రూట్‌ను పరిశీలించారు. సబ్దార్‌నగర్ రాజీవ్‌గాంధీ నగర్ నుంచి సికింద్రాబాద్ అబ్జల్‌గంజ్‌వరకు అదేవిధంగా అల్లాపూర్ రైల్వేస్టేషన్ నుంచి హైటెక్ సిటీ మీదుగా మెహిదిపట్నం వరకు బస్సు సౌకర్యం కల్పించేందుకు సర్వే నిర్వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, కోఆర్డినేటర్ వీరారెడ్డి, సబ్దార్‌నగర్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, షేక్ రఫీక్, మహ్మద్, రాంబాబు, అస్లాం, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను ఇంకెంతకాలం మోసగిస్తారు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్

ధర్నాచౌక్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అయినా బీసీలను తమ రాజకీయ లబ్ధికోసం వాడుకుంటూ మోసం చేస్తూనే ఉందని ఇంకా ఎంతకాలం బీసీలను మోసం చేస్తారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ ప్రశ్నించారు. శనివారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బీసీలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రధానికి లేఖ రాయటం హాస్యాస్పదంగా ఉందని, ముందు ముఖ్య మంత్రి రేపు రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు ఎంత శాతం రాజకీయ రిజర్వేషన్ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 60శాతం ఉన్న బీసీలకు కేవలం 23 అసెంబ్లీ సీట్లు కేటాయించి, ఇప్పుడు బీసీల మీద ప్రేమ ఉన్నట్లు మోదీకి లేఖ రాయటం బీసీలంతా గమనిస్తూనే ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే అఖిల పక్ష పార్టీలను ఢిల్లీకి తీసుకుపోయి బీసీ రిజర్వేషన్‌పై ఎందుకు వత్తిడి చేయలేదని ప్రశ్నించారు. బీసీలను రాజకీయంగా పైకి తేవాలని కేసీఆర్ కు ఉంటే ముందు తెలంగాణలో 33శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, మాదేశి రాజేందర్, జాజుల లింగంగౌడ్, నరేష్‌చారి, శ్యామల, వరలక్ష్మి పాల్గొన్నారు.

### విశ్వకర్మల సంక్షేమానికి బిజెపి కృషి: హరిగౌడ్

సైదాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకలకు మలక్‌పేట నియోజకవర్గం నుండి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ంలోని నరేంద్రమోడి ప్రభుత్వం విశ్వకర్మల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

## ఓబిసి జాతీయ సమాఖ్య ఆవిర్భావం

జాతీయ అధ్యక్షుడిగా కె.కోటేశ్వరరావు నియామకం

కోటేశ్వర్‌రావును సన్మానిస్తున్న బిఎస్.రాములు తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభావార్త: ఏడబ్లూజేఏ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కే.కే రావు ఆధ్వర్యంలో ఓబిసిల అభివృద్ధికై శనివారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఇదరు రాష్ట్రాల నుంచి మాజీ బిసి కమిషన్ చైర్మన్ రాములు, రిటైర్డ్ ఐఏఎస్ ప్రభాకర్, ఇస్రో మాజీ చైర్మన్ సుబ్రమణ్యం, వివిధ కుల సంఘాల నాయకులు, మేధావులు, రిటైర్డ్ ఉన్నతాధికారులు, సీనియర్ న్యాయవాదులు, పాల్గొని ఓబిసి కులాల సమస్యలపై చర్చించి వారివారి అభిప్రయాలను తెలిపారు. ఈసందర్భంగా మాజీ బిసి కమిషన్ చైర్మన్ రాములు మాట్లాడుతూ దేశంలోని ఓబిసి కులాలకు జరుగుతున్న అన్యాయాలపై ,ఇకముందు జరగాల్సిన అభివృద్ధిపై సూచనలు చేశారు. ఇక నుంచి ఓబిసిలు ఆర్థికంగా సామాజిక, రాజకీయంగా ఎదగడానికి పార్టీలకు అతీతంగా అందరూ సమిష్టి కృషి చేయాలని సూచించారు. ఈసమావేశంలో జాతీయ ఓబిసి సమాఖ్యనును ఏర్పాటు చేసి జాతీయ అధ్యక్షుడిగా కే.కోటేశ్వర్‌రావును ఎనుకున్నారు. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల కమిటీలను ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో మూడులక్షల మందితో భారీ బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈకార్యక్రమంలో ఏడబ్ల్యూ జే ఏ అసోసియేషన్ సభ్యులు ఆర్‌వి ఎల్ఎన్ ప్రసాద్, రాజ నర్సింహ్మాగౌడ్, కర్ణాకర్ గౌడ్, వెంకటరమణ,శ్రీధర్, పురుశోత్తం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఘనంగా అవంతి డిగ్రీ మినీ స్నాతకోత్సవం

విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించిన దృశ్యం

హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: ప్రతి విద్యార్థిలో నిగూఢమైన ప్రతిభ ఉంటుందని ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.రాములు అన్నారు. అవంతి డిగ్రీ కళాశాల మినీ స్నాతకోత్సవం, ప్లేస్‌మెంట్ దినోత్సవ వేడుకలు శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఘనంగా జరిగాయి. ఉత్తీర్ణులైన ఉద్యోగాలు పొందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ ఎం.రాములు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసి గమ్యవైపు దూసుకుపోవాలని అన్నారు. మంచి వ్యక్తిత్వంలో సమాజంలో మంచి పౌరుడిగా ఉండాలన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్‌సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సివి.రంజనీ మాట్లాడుతూ క్రమశిక్షణ లేని విద్య వాసనలేని పువ్వుతో సమానమన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరసోమయ్య, డైరెక్టర్(హెచ్ఆర్) డాక్టర్ జయప్రధ, డైరెక్టర్ డాక్టర్ వెంకటరావు, కార్యదర్శి ఎన్.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, ఉత్తమ ర్యాంకులు సాధించినవారికి బంగారు, వెండి పతకాలు, ఉద్యోగవకాశాలు అందుకున్న వారికి ఉద్యోగ అర్హత ప్రసంసాపత్రాలు అందించారు.

## డా. శంకర్‌నారాయణ రచించిన 'ఇంజనీర్ శతకం' ఆవిష్కరణ

డాక్టర్ శంకర్‌నారాయణ రచించిన 'ఇంజనీర్ శతకం' ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: ప్రగతి మహిళా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో డాక్టర్ శంకర్‌నారాయణ రచించిన 'ఇంజనీర్ శతకం' ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. సభకు హాస్యవధాని, ప్రముఖ పాత్రికేయులు 'హాస్యబ్రహ్మ' శంకరనారాయణ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సిఎస్‌సిసి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి.అంజనీకుమార్, ప్రముఖ కవి గంటా మనోహర్‌రెడ్డి, ఇంజనీర్ శతకం ప్రచారణకర్త ప్రొపెసర్ నందం సాంబశివరావు, పాటల రచయిత రాయారావు విశ్వేశ్వరరావు, మీర్‌ఖాన్‌పేట గ్రామం సర్పంచ్(రంగారెడ్డి జిల్లా) జ్యోతి చంద్రశేఖరరావు, సీనియర్ బిజినెస్ కన్సల్టెంట్ ప్రతాప్ మల్లాది, నిర్వాహక సంస్థ అధ్యక్షురాలు సుధారాణి కృష్ణంరాజు, ఆర్గనైజర్ రామాయణం అన్వేష్‌కుమార్, సంగుభట్ల నాగేందర్, పప్పు విద్యాసాగర్, ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ కొండా రవీందర్ పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకి చేయూత అందించేందుకు ఎప్పుడూ సిద్ధం

ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిరుపేద విద్యార్థులకు చేయూత అందించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటానని కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెంబర్ 2లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దాదాపు 200మంది విద్యార్థి. విద్యార్థినులకు ఎమ్మెల్యే మాధవరం తన సొంత ఖర్చులతో బ్యాగ్స్, బుక్స్, పెన్సిల్ , వాటర్ బాటిల్, పెన్నులు, అక్స్ఫర్డ్ డిక్షనరీతో కూడిన కిట్లను స్థానిక కార్పోరేటర్ పగుడాల శిరీష బాబురావు, కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ సతీష్ ఆరోరాతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా ధీటుగా ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 10/10 సాధించిన వారికి ట్యాబులను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఇంత గొప్పగా ఎమ్మెల్యే పిల్లల కోసం ఆలోచన చేసి ఆచరణలో పెట్టి కిట్స్ అందించినందుకు ఎమ్మెల్యేకు పిల్లలు, టీచర్స్ అందరూ ధన్యవాదాలు తెలిపారు.

## ప్రత్యంగిరా అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ ఇంఛార్జి మాణికం ఠాగూర్

ఎల్.బి.నగర్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ, తెలంగాణ ఇంచార్జ్ మాణికం ఠాగూర్ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులో శ్రీమౌనస్వామి స్థాపించిన కుర్తాళం పీఠం తపస్సులకి, సాధనలకి అద్భుత మహిమాన్వితి క్షేత్రమని, ప్రస్తుత పీఠాధిపతులు జగద్గురువులు శ్రీసిద్దేశ్వరానందభారతి మహాస్వామి గొప్ప సిద్ధపురుషులని, నడిచే దైవమని అన్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ ఆయనకు అమ్మవారి ఫోటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సబ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి, ప్రమోద్, కృష్ణారెడ్డి, సంతోష్, ధనరాజ్‌గౌడ్, రమేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలీని ప్రారంభించిన లింగాని ప్రసన్న

**అడ్డగుట్టలో..** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో శనివారం జరిగిన ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ పెద్దయెత్తున పార్టీ నేతలతో కలిసి బయలుదేరి వెళ్ళారు. ముందుగా అడ్డగుట్ట చంద్రయ్య హోటల్ వద్ద నుండి ప్రారంభం అయిన ర్యాలీ కార్పొరేటర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యాక్రమంలో పార్టీ నేతలు, కార్యాకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

వెంకటగిరిలో విద్యార్థులకు గణేష్ మట్టి విగ్రహాలను అందజేస్తున్న యూత్ అసోసియేషన్ కమిటి సభ్యులు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు మట్టితో తయారుచేసిన గణేష్ విగ్రహాలను పూజించాలని వెంకటగిరి యూత్ అసోసియేషన్ కమిటి సభ్యులు పేర్కొన్నారు.శనివారం యూసుఫ్ గూడ డివిజన్ వెంకటగిరి యూత్ అసోసియేషన్ గణేష్ మండపం వద్ద సంస్కృతి ప్రీస్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కమిటి సభ్యులు జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, శ్రీనువాస్, పాఠశాల ప్రిన్సిపల్ సీత శంకర్, వరలక్ష్మీపాల్గొన్నారు.

## నాదర్‌గుల్‌లో హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పూజలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: నగర శివార్లలోని నాదర్‌గుల్‌లో హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పూజలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని పురాతన ఆలయాన్ని గ్ర

## అరుణోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, క్లబ్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**

విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించాలి శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శంకర్‌పల్లి అరుణోదయ యూత్ క్లబ్ వద్ద అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అండర్ 14, 17 కబడ్డీ క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి కూడా తోడ్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ శ్వేతా పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాష్, అరుణోదయ యూత్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు సలీం, గౌస్, రంపాల్, చిన్న, లాలి, మైపాల్‌రెడ్డి, మనోహర్, నాగి, విక్రమ్ రెడ్డి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ముదిరాజ్

బీసీసెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్ ముదిరాజ్‌కు నియమక పత్రాని అందజేస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్,

**కోట్‌పల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త;**

కోట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్ ముదిరాజ్‌ను శనివారం నాడు వికారాబాద్‌లోని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ నివాసంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామన్నారు. మండలంలో పార్టీ బలంగా ఉందని వచ్చే ఎన్నికల్లో వికారాబాద్‌లో పార్టీ విజయం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసింది ఏమి లేదని కాంగ్రెస్ పార్టీ చేసిందే అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. అధికారంలోకి రాగనే ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తమన్నారు. నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దూద్యాల లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు, ఈకార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు అయూబ్ అన్సారీ, కోట్‌పల్లి మండల అధ్యక్షులు నర్సింగ్ నాయక్, నాయకులు వాహిద్‌మియా, రాంచెందర్‌రెడ్డి(టిల్లు) ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బిచ్చిరెడ్డి, అంజయ్య, రాజేశ్వర్‌రెడ్డి ,శ్రీనివాస్, మాధవ్, శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగియుండాలి

**-మండల బిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు నారాయణ్‌రెడ్డి**

మంబాపూర్‌లో పల్లకీ ఊరెగింపులో పాల్గొన్న భక్తులు

**పెద్దేముల్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:**

ప్రతిఒక్కరు దైవచింతన కలిగియుండాలని మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో శ్రావణ మాసం ముగింపు సందర్భంగా భజన సమాప్తిలో భాగంగా శనివారం శ్రీ ఆంజనేయస్వామి పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో భజన చేసిన భక్తులకు ఆ భగవంతుడి కరుణ కటాక్షాలు ఉంటాయని ఆకాంక్షించారు. భగవంతుడిని నమ్ముకున్న వాడు ఏన్నడు చెడిపోరని, అందుకు ప్రతిఒక్కరు దైవనామ స్మరణను అలవర్చుకోవాలని అన్నారు. పల్లకీ ఊరెగింపు అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు ప్రసాద్‌గౌడ్, జె.నర్సిములు, ద్వారవరి వీరారెడ్డి, తలారి రాము లు, టి,విజయ్, యం,రాములు, కె.శ్రీనివాస్, వై.రాములు, తాడి అంజి, సంగెం చంద్రప్ప, బంటారం భీమేష్, శ్రీనివాస్ గౌడ్, హెచ్.దస్థప్ప, జి,మల్లప్ప, వై,లాలప్ప, వై,బండెప్ప, వై,భీమప్ప, సిహెచ్.నర్సిములు, హెచ్,నర్సిములు, జి,బాల య్య,మంతటి లాలప్ప, బల్ల మల్లయ్య, శరత్‌తేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**-ప్రథమశ్రేణీ న్యాయమూర్తి శ్రీరామ్**

**కొడంగల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొడంగల్ మున్సిఫ్‌కోర్టు ప్రథమశ్రేణీ న్యాయమూర్తి శ్రీరామ్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. విద్యార్థులు విద్యాభివృద్ధితో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు డ్రగ్స్ ,మత్తు మందు తదితర చెడు అలవాట్లు దూరంగా ఉంటూ ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. అంతేగాక కళాశాలల్లో ర్యాగింగులు తదితర వాటికి పాల్పడకుండా ఏకాగ్రత, పట్టుదలతో విద్యను అభ్యసిస్తు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అంతకుముందు పలువురు న్యాయవాదులు పలు చట్టాలపై విద్యార్థులకు విపులంగా వివరించారు .కార్యక్రమంలో బార్ అసోసియోషన్ అద్యక్షులు వెంకటయ్య, న్యాయవాదులు, సీఐ రాములు, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కస్తూర్బా పాఠశాలలో న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ

కొడంగల్ పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను శనివారం న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదిని పరిశీలించి విద్యార్థినిలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వంట గది ఆపరిశుభ్రంగా ఉండడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేస్తు పాఠశాల సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

## బిజెపి నాయకుల ముందస్తు అరెస్టులు

షాద్‌నగర్‌లో అరెస్టు అయిన బీజేపీ నాయకులు.

**షాద్‌నగర్, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు మీడియాతో మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు. కనీసం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం స్థలంలో ఇప్పటి వరకు తట్టెడు మట్టిని తీయలేదని, మరి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం ఎలా పూర్తి అయినట్లు అవుతుందని ఆయన ప్రశ్నించారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉండి రెండుసార్లు షాద్‌నగర్ ఎన్నికల ప్రచారంలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం హామీలు గుప్పించి ప్రజల ఓట్లు దండుకున్నారని ఆయన ఆరోపించారు. గత 10 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో రకాలుగా ఇక్కడి ప్రజలను మోసం చేశాని, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే క్షేమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని లేకుంటే షాద్‌నగర్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని ఆయన అన్నారు. భూగర్భ జలాలపై ఆధారపడ్డ నియోజకవర్గ రైతులను ప్రజలను తాగునీరు సాగునీరు విషయంలో ఘోరంగా మోసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి కాకముందే ఎన్నికల కోసం ప్రారంభిస్తున్నారని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు. అరెస్టులు అయిన వారిలో అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, దేపల్లి ఆశోక్‌గౌడ్,, కమ్మరి భూపాల్‌చారి, కక్కునూరి వెంకటేష్‌గుప్త, చెట్ల వెంకటేష్, ఋషికేష్ ఉన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కవిత.

**మహేశ్వరం, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :**

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మహేశ్వర మండల కమిటీ ఆధ్వర్యయంలో తుక్కుగూడ లక్ష్మీ గార్డెన్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభను శనివారం నిర్వాహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కవిత మండల కార్యదర్శి అలవాల రవికుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాటి నైజాం కాలంలో గ్రామీణ ప్రాంతాలలో వెట్టి చాకిరి నుంచి పేదలను విముక్తి చేసి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది ఎర్రజెండా అన్నారు. దీన్నే వాడికి భూమి కావాలని గ్రామ స్వరాజ్యాలు ఉండాలని నాటి నిజాం సైన్యాలపై గేరిల్లా దళాల ద్వారా నిజాం సైన్యాలు హైదరాబాద్‌కు పారిపోయి నెహ్రూకు లొంగిపోయారని అన్నారు. దొడ్డి కొమరయ్య బలిదానం మల్లు స్వరాజ్యం అరట్ల కమలా దేవి బి.యన్‌రెడ్డి పుచ్చలపల్లి సుందరయ్య కాచం కృష్ణమూర్తి ఇలాంటి అనేక మంది నాయకులు పేదల కోసం నిస్వార్థంగా పోరాడి ఎట్టిచాకరి నుంచి విముక్తి కల్పించారన్నారు. కానీ నేటి పాలకులు హిందూ ముస్లిం ఘర్షణగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. నిజాం నవాబు కింద పనిచేసిన వారంతా హిందువులేనని ప్రజలను పీడించింది హిందువులని వారి ఆకృత్యాలకు అదుపు లేదని అన్నారు. ఇది కేవలం వ్యక్తి నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటంగా నేటి సమాజం అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు శేఖర్, జిజల్లా కమిటీ సభ్యులు అనేక మంది పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి : శ్రీవర్ధన్‌రెడ్డి

**షాద్‌నగర్, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని శనివారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణ మెయిర్ రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, ఆశోక్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్ 17న రజాకార్ల పాలన నుంచి తెలంగాణకు విముక్త లభించిందని ఆయన గుర్తు చేశారు. నాటి నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి విముక్తి కావాలని ఎందరో పోరాటాలు చేశారని, సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణకు విమోచనం కల్పించారని ఆయన అన్నారు. ప్రస్తుతం ఓట్ల రాజకీయాల కోసం తెలంగాణ స్వాతంత్ర్య చరిత్రను మరిపించడానికి సమైఖ్యత దినోత్సవం పేరుతో తెలంగాణ విమోచనం కోసం అమరులైన అమరవీరుల చరిత్రను నేటి యువతకు తెలియజేయకుండా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విమోచన దినోత్సవాన్ని కర్ణాటక ప్రాంతంలో అధికారికంగా అక్కడి ప్రభుత్వాలు నిర్వహిస్తుంటే మరి కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు అధికారంగా చేయట్లేదని వారు ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో పదే పదే మాట్లాడిన కేసీఆర్ నేడు ఎంఐఎం ఒత్తిళ్లకు తలొంచి ఈ చరిత్రను మారుస్తున్నారని వారు ఆరోపించారు. నాడు రజాకార్ల మీద తెలంగాణ సమాజం ఎలా అయితే తిరగబడిందో, నేడు కేసీఆర్ కుటుంబ పాలనపై తెలంగాణ ప్రజలు తిరగబడే రోజు వస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అజాద్ ఇక అమృత్ మహోత్సవాల సందర్భంగా గత సంవత్సరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా జరిపారు. నిజంగా మన స్వతంత్ర్య సమరయోధులను గుర్తించిందని అన్నారు. ఈ సారి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అధికారికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అందరికీ గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్‌రెడ్డి, రణదీర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, దొడల వెంకటేష్, బోయ కురుమయ్య, సుధాకరప్ప, శివాజీ కంచుకోట మణికంఠ, శ్రవణ్, భరత్, పిట్టల సురేష్,, సాయిగౌడ్, గట్టూజు విజయ్, వివేక్, భీమయ్య, వివిధ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు.

## సిఎం సభకు భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

**కొడంగల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు సీఎం కేసీఆర్ బహిరంగ సభకు కొడంగల్ నియోజకవర్గం నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ ,కోస్గీ, మద్దూర్, దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి తదితర మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో భారీగా తరలివెళ్ళారు. సీఎం సభకు తరలివెళ్తున్న వాహనాలకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జెండా ఊపగా వాహనాలు కొల్లాపూర్‌కు తరలివెళ్ళాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చారిత్రక ఘట్టమని ఈ ప్రాజెక్టు ద్వారా కొడంగల్ నియోజకవర్గంలో 1లక్ష17వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. అనంతరం వివిధ వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సీఎం సభకు తరలివెళ్ళారు.

## ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ఆర్పీల వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

**కొడంగల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**

కొడంగల్ మున్సిపల్ పరిధిలో మెప్మాలో రిసోర్స్ పర్సన్‌లుగా విధులు నిర్వహిస్తున్న తమ డిమాండ్‌ల పరిస్కారానికి చర్యలు తీసుకోవాలని రిసోర్స్‌పర్సన్‌లు కోరారు. ఈమేరకు వారు శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పేదరిక నిర్మూలనకై అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మద్య నిరంతరం అనుసంధాన కర్తలుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు అందిస్తు రూ.18వేల గౌరవ వేతనం ఇవ్వాలని, జీవిత భీమా కల్పించాలని వినతిపత్రంలో కోరారు. స్పందించి ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి డిమాండ్ పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హమీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్పీలు అనందమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, మంజుల, మల్లేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎఫ్‌సీనగర్‌లో పార్కు అభివృద్ధి పనులు

ఎన్ఎఫ్‌సీనగర్‌లో పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ కమీషనర్ సాబేర్‌అలీ, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ రమాదేవి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ 2వ వార్డు పరిధిలోని సీ-2 పార్కు అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ కమీషనర్ సాబేర్‌అలీ, వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. 2వ వార్డులో త్వరలో పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని వైఎస్‌చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయని స్థానిక కౌన్సిలర్ రమాదేవి నిరంతరం పనులను పర్యవేక్షించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా కౌన్సిలర్ రమాదేవి కమీషనర్, వైఎస్‌చైర్మన్‌లను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఇంజనీర్ సన్నీ, వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యాదగిరిరావు, మాజీ వార్డుసభ్యురాలు విమల, నాయకులు అంజనేయులు, పందిరి శశికళ, సల్ల శివ, యాదయ్య, సిఆర్‌కె.రాజు, సూర్యకాంత్, హనుమంతరావు, లక్ష్మిపతి, సత్యనారాయణ, కృష్ణ, పండిత్, సాంబశివరావు, సత్యంరావు, కాంట్రాక్టర్ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## మండల బీసీ సంక్షేమ సంఘం పూర్తిస్థాయి కార్యవర్గం

శివారెడ్డిగూడలో ఎన్నికైన మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సభ్యులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు మండల అధ్యక్షులు మెడబోయిన వెంకటేశ్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్‌హాలులో శనివారం బీసీ కులాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కులసంఘాల నాయకులు చర్చించి ఏకాభిప్రాయంతో అన్ని కుల సంఘాలకు ప్రాధాన్యత కల్పించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షులు మెడబోయిన వెంకటేశ్, ప్రధానకార్యదర్శి వరికుప్పల లింగస్వామిల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా న ర్రి శ్రీశైలం, కంది సత్యనారాయణ, మడ్డి రవిగౌడ్, ఎలసాని ఐలయ్యయాదవ్, యంజాల భాస్కర్‌గౌడ్, కోశాధికారిగా నీరుడి కుమార్, కార్యనిర్వహక కార్యదర్శిగా మెడబోయిన రాజు, కార్యదర్శులుగా బొంత వెంకటేశ్, దేరంగుల బాల్‌రాజ్, సోమసాని రమేశ్, ఉదారి శంకర్, గుండోజు కృష్ణాచారీ, బైరు పాండుగౌడ్, బోదాసు సురేశ్, పల్లపు శ్యామ్, ప్రచార కార్యదర్శిగా కురుపాల విజయ్‌కుమార్, అచ్చిని దినేశ్, మెంగ బాలకృష్ణ, సుర్వి కృష్ణలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలంలో సంఘం బతోపేతానికి అందరూ కలిసి కృషి చేయాలని అధ్యక్షులు వెంకటేశ్ కోరారు.

## టీచర్ల బదిలీలు,పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఓ విజయకుమారిని కలిసి ఉపాధ్యాయుల వినతిపత్రం అందజేసిన జిల్లా పిఆర్‌టియు తెలంగాణ నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16, ప్రభాతవార్త**

ఉపాధ్యాయుల బదిలీలు, పధోన్నతులు పారద్శకంగ నిర్వహించేలా చూడాలని, పధోన్నతులలో మెడికల్, స్పౌజ్ దృవపత్రాలను పరిశీలించి డిఎస్‌సి ర్యాంక్ ఆధారంగ సీనియారిటీ లీస్టు తయారు చేయించి వాటిని నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారిని జిల్లా పిఆర్‌టియు తెలంగాణ నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఓను కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని జిల్లా పిఆర్‌టియు తెలంగాణ జిల్లా అధ్యక్షులు ఎం.మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.శ్రీధర్, శామీర్‌పేట మండల అధ్యక్షులు రామిడి వెంకట్రామ్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రావు, కాప్ర మండల అధ్యక్షులు ఎన్.మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల ఫ్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఫ్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు కోరటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి ఎం. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు అందరు ఫ్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ధరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని ఆయన సూచించారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిఎస్ఓటిఎంఎంఎస్. జిఓవి. ఇన్ వెబ్‌సైట్ నందు 2023అక్టోబరు 31లో ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకటలక్ష్మి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణం : ప్రధానోపాధ్యాయులు నర్సింహయ్య

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

**పెద్దేముల్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:**

2023 విద్యా సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా జి.వెంకటలక్ష్మి ఎంపిక కావడం పాఠశాలకే గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు నర్సింహయ్య అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా వెంకటలక్ష్మి ఎంపిక కావడం పట్ల శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల తరఫున హెచ్ఎం ఆమేను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నర్సింహయ్య మాట్లాడుతూ వెంకటలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడంతో ఆమేపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు క్రమశిక్షణకు మారుపేరు వెంకటలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జే.శ్రీనివాసులు, సి,రవిందర్‌రెడ్డి, బి.నర్సిరెడ్డి, జె.సంగీత, నఫీజ్ సుల్తానా, కే.రాధ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జయక్రిష్ణ

రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్చం అందిస్తున్న జయక్రిష్ణ

**బొంరాస్‌పేట్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**

బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులుగా బొంరాస్‌పేట్ మండలానికి చెందిన జయక్రిష్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు శనివారం హైద్రాబాద్‌లో టీపీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియమకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు టీపీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో కొడంగల్ తాలూకా బ్లాక్ కాంగ్రెస్ అద్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు నియోజకవర్గంలో కాం గ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో మమేకమై పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గతకొంత కాలంగా ప్రజల్లో కాంగ్